క్లుప్తంగా

ఎంపీకి శుభాకాంక్షలు



ఎంపీకి శుభాకాంక్షలు తెలుపుతున్న నాయకులు

షాద్‌నగర్: రాజ్యసభ సభ్యుడు అనిల్‌కుమార్ యాదవ్‌ను సోమవారం షాదనగర్‌కు చెందిన పలువురు నాయకులు కలిశారు. ఎంపీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని పట్టణానికి చెందిన బీఆర్‌ఎస్ మాజీ యువ నాయకుడు మధు ఆధ్వర్యంలో పలువులు నాయకులు హైదరాబాద్‌లోని న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌కు వెళ్లి ఎంపీని కలిసి శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో సాబేర్, రాము, క్రాంతి, రవి, నాగరాజు, నరేశ్, సత్యం, వెంకట్, శ్రీకాంత్, అనిల్, శ్రీనాథ్, అరవింద్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ కంఠాన్ని కాపాడండి

ఎంపీడీఓకు యువజన సంఘం వినతి

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలోని గ్రామ కంఠం భూమిని కాపాడాలని గ్రామ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు సోమవారం ఎంపీడీఓ, పంచాయతీ కార్యదర్శులకు వేర్వేరుగా వినతి పత్రాలు అందించారు. గ్రామంలో సర్వే నంబర్ 2లో 18 గుంటల భూమి ఉందని యువజన సంఘం సభ్యులు వినతిపత్రంలో తెలి పారు. అందులో ముత్యాలమ్మ గుడి ఉందన్నారు. సర్వే నంబర్ 1లో పట్టాదారు గ్రామంలో కొందరికి ప్లాట్ల రూపంలో విక్రయాలు చేసి గ్రామ కంఠంను కబ్జా చేస్తున్నట్లు తెలిపారు. ఇలా ఇప్పటికే ఇంటి నిర్మాణం కూడా జరిగిందని వారు ఆరోపించారు. అధికారులు స్పందించి విలువైన గ్రామ కంఠంను కాపాడాలని వారు కోరారు. వినతిపత్రాలను అందించిన వారిలో సభ్యులు జంగయ్య, సాయిలు, కృష్ణ, గణేశ్, నరేశ్ తదితరులు పాల్గొన్నారు.

వర్షాలకు కూలిన ఇళ్లు

ఆదుకోవాలని కోరుతున్న బాధితులు



కూలిన పైకప్పు

కొత్తూరు: వారం రోజులుగా కురుస్తున్న ముసురు వర్షాలకు సోమవారం మున్సిపాలిటీ పరిధిలోని ఎస్సీ కాలనీలో రెండు ఇళ్లు పాక్షికంగా కూలిపోయాయి. కాలనీలో నివాసం ఉంటున్న గాలయ్య, వెంకటయ్యలకు చెందిన పెంకుటిళ్లు కొన్ని రోజులుగా ముసురు వర్షాలకు పూర్తిగా తడిసిపోయాయి. దీంతో సోమవారం ఉదయం పైకప్పు, కొద్ది మేర గోడలు కూలిపోయాయి. కాగా తమను ప్రభుత్వం ఆదుకోవాలని బాధితులు విజ్ఞప్తి చేస్తున్నారు.

అర్హులకు డబుల్ ఇళ్లు ఇవ్వాలి

శంకర్‌పల్లి: పట్టణ శివారులో నిర్మించిన డబుల్ బెడ్రూం ఇళ్లు స్థానికులు, అర్హులకే కేటాయించాలని శంకర్‌పల్లి ప్రస్తుత మాజీ ఎంపీపీ ధర్మన్నగారి గోవర్ధన్‌రెడ్డి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం ఆయన పట్టణంలో బీజేపీ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ.. పట్టణ శివారులో 1512 ఇళ్లు నిర్మిస్తే దాంట్లో కేవలం 150 మాత్రమే కేటాయించడం సబబుకాదని, మున్సిపాలిటీ, మండలానికి 500 ఇళ్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. స్థానిక ఎమ్మెల్యేకు శంకర్‌పల్లి మున్సిపాలిటీ, మండలంపై శ్రద్ధ లేకుండా పోయిందని, ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. డబుల్ బెడ్రూం ఇళ్లపై అధికారులు స్పష్టత ఇవ్వకపోతే రాబోవు రోజుల్లో పెద్దఎత్తున నిరసన, ఆందోళన కార్యక్రమాలు చేపడుతామని హెచ్చరించారు. సమావేశంలో బీజేపీ మండల అధ్యక్షుడు రాములుగౌడ్, నాయకులు పరమేశ్వర్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, వాసుదేవ్ కన్నా, బీర్ల నర్సింహ, బయన్న, పాండురంగం తదితరులు పాల్గొన్నారు.

క్రమశిక్షణతో విద్యనభ్యసించాలి



ఉపాధ్యాయురాలిని సన్మానిస్తున్న విద్యార్థులు

మొయినాబాద్‌రూరల్: విద్యార్థులు క్రమశిక్షణతో నాణ్యమైన విద్యను అభ్యసించేందుకు కృషి చేయాలని అమ్డాపూర్ పాఠశాల హెచ్‌ఎం రేణుక అన్నారు. మండల పరిధిలోని అమ్డాపూర్ జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులకు సన్మాన కార్యక్రమాన్ని విద్యార్థులు నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాలలోని ఉపాధ్యాయులను విద్యార్థులు పూలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన దారుల్లో అవస్థల ప్రయాణం

బురదమయంగా అంతారం-మన్‌మర్రి రోడ్డు

- ఏళ్ల తరబడి మరమ్మతులు నిల్
- గుంతలతో తరచూ ప్రమాదాలు
- పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

షాబాద్: మండలంలోని పలు గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. గుంతలుగా మారిన దారులతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రాత్రిపూట రాకపోకలు సాగించాలంటే ప్రజలు జంకుతున్నారు. ఏళ్ల తరబడి మరమ్మతులకు నోచుకోకపోవటంతో ప్రయాణం నరకంగా ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల పరిధిలోని రుద్రారం నుంచి హైతాబాద్, అంతారం నుంచి మన్‌మర్రి, పోతుగల్ నుంచి మాచన్‌పల్లి, మల్లారెడ్డిగూడ నుంచి ఎర్రోనిగూడ వెళ్లే దారులు గుంతలమయంగా మారడంతో రహదారిపై ప్రయాణం చేయాలంటే ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని వెళ్లాల్సి వస్తోందని ప్రయాణికులు భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏళ్లుగా మరమ్మతులు చేపట్టకపోవడంతో రోడ్లు గుంతలమయంగా మారి ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు మరింత అధ్వానంగా తయారయ్యాయి. దీంతో వాహనదారులు రోడ్డుపై ప్రయాణించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

అడుగడుగునా గుంతలే..

మండలంలోని అంతారం స్టేజి నుంచి మన్‌మర్రి వరకు రోడ్డుపై అడుగడుగునా గుంతలు ఏర్పడ్డాయి. మల్లారెడ్డిగూడ నుంచి ఎర్రోనిగూడ రోడ్డుపై గుంతల్లో వర్షానికి నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. రుద్రారం నుంచి హైతాబాద్ రోడ్డుపై గుంతలు వరదనీటితో నిండి ఉండటంతో ద్విచక్ర వాహనదారులు అదుపుతప్పి ప్రమాదాల బారిన పడిన సంఘటనలు అనేకం ఉన్నాయి. మన్‌మర్రి నుంచి వందలాది మంది ప్రజలు నిత్యం ఉద్యోగాలు, నిత్యావసర సరుకుల కొనుగోలు కోసం శంషాబాద్, చేవెళ్ల, షాబాద్, షాద్‌నగర్‌కు వెళ్తుంటారు. నిత్యం గుంతల రోడ్డుపై ప్రయాణం చేయడంతో మెన్నునొప్పి, నడుమునొప్పి వంటి సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్లకు మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు. ఈ విషయమై ఆర్‌అండ్‌బీ ఏఈ సూర్యనారాయణను వివరణ కోరగా.. ఈ రోడ్లు అధ్వానంగా మారిన విషయం వాస్తవమే. ఈ రోడ్డు మరమ్మతుల విషయంపై ఉన్నతాధికారులకు ప్రతిపాదనలు పంపించాం. నిధులు మంజూరు కాగానే మరమ్మతులు చేస్తామని పేర్కొన్నారు.



బురదమయంగా రుద్రారం-హైతాబాద్ రోడ్డు



అధ్వానంగా మల్లారెడ్డిగూడ-ఎర్రోనిగూడ రోడ్డు

ప్రమాదాలకు గురవుతున్నాం



రుద్రారం-హైతాబాద్ రోడ్డుపై అధికంగా గుంతలు ఉండటంతో రాత్రివేళలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంటుంది. రోడ్డుకు ఎలాంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు. నేను ఈ రోజు బైక్ అదుపుతప్పి రోడ్డుపై ఉన్న గుంతలో పడిపోయాను.

– బండ కృష్ణ, రుద్రారం, షాబాద్

గుంతలు పూడ్చాలి



మల్లారెడ్డిగూడ స్టేజి నుంచి ఎర్రోనిగూడ వరకు రోడ్డుపై అనేక గుంతలు ఏర్పడ్డాయి. పలు మార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదు. రాత్రివేళల్లో ఈ రోడ్డుపై ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. వర్షాలకు రోడ్డుపై ఉన్న గుంతల్లో నీరు నిలిచి చెరువులను తలపిస్తున్నాయి. అధికారులు, ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి ఎర్రోనిగూడ రోడ్డును బాగు చేయాలి.

– సామ ప్రతాప్‌రెడ్డి, ఎర్రోనిగూడ, షాబాద్

మరమ్మతులు చేపట్టాలి



అంతారం నుంచి మన్‌మర్రి వరకు రోడ్డుపై అధికంగా గుంతలు ఉండటంతో ప్రయాణికుల రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నారు. రాత్రివేళలో ద్విచక్ర వాహనంపై ప్రయాణించాలంటేనే భయంగా ఉంటుంది. అధికారులు ప్రజాప్రధినిధులు వెంటనే స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలి. ప్రయాణికులు నిత్యం ప్రమాదాల బారిన పడుతున్నారు.

– ఎండీ ఇనాయత్, బోడంపహాడ్, షాబాద్

13న క్రీడాకారుల ఎంపిక

షాద్‌నగర్‌రూరల్: ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని కమ్మదనం గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఈ నెల 13వ తేదీ ఉదయం 8గంటలకు స్కూల్ గేమ్స్ ఫెడరేషన్(ఎస్‌జీఎఫ్) ఆధ్వర్యంలో క్రీడాకారులను ఎంపిక చేస్తున్నామని ఎస్‌జీఎఫ్ జోనల్ సెక్రటరీ రాజశేఖర్‌రెడ్డి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మండల స్థాయిలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్, గురుకుల, కేజీబీవీ, మైనార్టీ పాఠశాలల నుంచి అండర్-14, అండర్-17 విభాగంలో విద్యార్థినీ, విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, అథ్లెటిక్స్, షాట్‌పుట్, లాంగ్‌జంప్, 100 మీటర్లు, 200 మీటర్లు, 400 మీటర్లు, 800 మీటర్ల పరుగు పందె పోటీలకు క్రీడాకారులను ఎంపిక చేస్తామని పేర్కొన్నారు. ప్రతీ పాఠశాల నుంచి ఒక్కొక్క విభాగానికి ఇద్దరు చొప్పున విద్యార్థులను తీసుకు రావాలని సూచించారు. కమ్మదనం గురుకుల పాఠశాల క్రీడా ప్రాంగణంలో పీఈటీ, పీడీలు తమ టీమ్‌లతో సిద్ధంగా ఉండాలని, క్రీడాకారులకు భోజన వసతి కల్పిస్తామని తెలిపారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

మున్సిపాలిటీ ఏర్పాటుతోనే అభివృద్ధి

చేవెళ్ల: మున్సిపాలిటీ ఏర్పాటుతోనే చేవెళ్ల అన్ని రంగాల్లో అభివృద్ధి జరుగుతుందని మున్సిపాలిటీ ఏర్పాటుకు అందరూ సహకరించాలని బీజేపీ నియోజకవర్గ యూత్ నాయకుడు మల్గారి వైభవ్‌రెడ్డి అన్నారు. చేవెళ్లలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల పార్లమెంట్, అసెంబ్లీ హెడ్‌క్వార్టర్‌గా ఉన్న నేటివరకు మున్సిపాలిటీగా మారకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. చేవెళ్లను మున్సిపాలిటీగా మారుస్తున్నట్లు గతంలో అధికారంలో ఉన్న బీఆర్‌ఎస్ పార్టీ ఎమ్మెల్యే, ఎంపీలు రెండు సార్లు ప్రకటనలు చేసినా ఫలితం లేదన్నారు. అప్పుడు ఎమ్మెల్యేగా ఉన్న కాలె యాదయ్యనే ప్రస్తుతం కూడా ఎమ్మెల్యేగా ఉన్నారని ఈసారి అయినా చేవెళ్లను మున్సిపాలిటీగా మార్చాలన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి చేవెళ్లను అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు.

వర్షాలతో చెరువులకు జలకళ



చెరువు వద్ద పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే, నాయకులు

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

షాద్‌నగర్: వర్షాలతో చెరువులు, కుంటలకు జలకళ వచ్చిందని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ అన్నారు. వర్షాలకు మండల పరిధిలోని చించోడ్ గ్రామ శివారులో ఉన్న బ్రహ్మ చెరువు సోమవారం అలుగుపారింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే చెరువు వద్ద గంగమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భారీగా వర్షాలు కురవడంతో చెరువులకు నీళ్లు చేరాయని, దీంతో భూగర్భజలాలు పెరుగుతాయన్నారు. ఫలితంగా రైతులకు సాగునీటి సమస్యలు కొంతవరకు తీరుతాయన్నారు. రైతులు తమ పొలాల్లో పంటలను సాగు చేసుకోవచ్చని సూచించారు. అదేవిధంగా చెరువుల కాపలాదారులకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని పేర్కొన్నారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చేందుకు సీఎం రేవంత్‌రెడ్డి ఎంతో కృషి చేస్తున్నారన్నారు ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చడంతో పాటు రాష్ట్రాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. కార్యక్రమంలో నాయకులు చల్లా శ్రీకాంత్‌రెడ్డి, బాల్‌రాజ్‌గౌడ్, నెహ్రూ, అజ్మత్‌బాబా అలీ, రేకల శ్రీనివాస్, ఎల్లప్ప, శ్రీధర్‌రెడ్డి, రాజు, హాజీపాషా, ముబారక్, సుదర్శన్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు బాగు చేయాలని నిరసన

పంచాయతీరాజ్ డీఈకి గ్రామస్తుల వినతి

మొయినాబాద్: చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు పూర్తిగా గుంతలమయంగా మారిందని, రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరైనా పనులు చేయడం లేదంటూ చిలుకూరు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. సోమవారం గుంతల రోడ్డుపై ఫ్లెక్సీలు పట్టుకొని నిరసన తెలిపారు. అనంతరం మొయినాబాద్‌లోని పంచాయతీ రాజ్ సబ్ డివిజన్ కార్యాలయం వరకు ర్యాలీగా వెళ్లి డీఈ విజయ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ.. చిలుకూరు-మొయినాబాద్ రోడ్డు అభివృద్ధికి నిధులు మంజూరై రెండేళ్లు దాటినా పనులు చేపట్టడం లేదన్నారు. అధికారులు, కాంట్రాక్టర్ నిర్లక్ష్యంతోనే పనులు జరగడం లేదని మండిపడ్డారు. వర్షాలతో రోడ్డుపై పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. రోడ్డుపై ఏర్పడిన గుంతల్లో మోకాళ్లలోతు నీళ్లు ఉండి వాహనాలు వెళ్లినప్పుడు గుంతల్లో పడిపోయి ప్రమాదాలకు గురవుతున్నామని వాపోయారు. అధికారులు వెంటనే స్పందించి రోడ్డు పనులు చేయించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ పురాణం వీరభద్రస్వామి, బీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు జొన్నాడ రాజు, గ్రామస్తులు జకరయ్య, కుమార్, రాజు, కదీర్, ప్రసాద్, మహబూబ్, అంజి పాల్గొన్నారు.



ఫ్లెక్సీలు పట్టుకొని నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

పాఠశాల అభివృద్ధికి సహకారం

చేవెళ్ల: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి దాతలు అందించే సహాయం మరువలేనిదని హెచ్‌ఎం సంగీత అన్నారు. మండలంలోని దామరగిద్ద గ్రామంలో ఉన్న ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో సోమవారం గ్రామానికి చెందిన దాత కాంగ్రెస్ పార్టీ ఓబీసీ సెల్ మండల ఉపాధ్యక్షుడు ఘనపురం శేఖర్ ముందుకొచ్చి పాఠశాలకు వాల్‌బోర్డును, విద్యార్థులు తాగేందుకు ఉపయోగించే వాటర్ క్యాన్‌లను తండ్రి బాలయ్య చేతుల మీదుగా ఉపాధ్యాయులకు అందజేశారు. దాతను పాఠశాల సిబ్బంది ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామస్తులు మల్లేశ్, అంజయ్య, సత్తయ్య, తదితరులు ఉన్నారు.

స్థానిక సంస్థలకు నిధులు పెంచాలి

జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాల



సమావేశంలో చర్చిస్తున్న సభ్యులు

కేశంపేట: 2011 జనాభా ప్రతిపాదికన స్థానిక సంస్థలకు వచ్చే నిధులు సరిపోవడంలేదని, 2024 జనాభా ప్రతిపాదికన నిధులు అందించాలని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు తాండ్ర విశాలశ్రావణ్‌రెడ్డి అన్నారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో 16వ ఆర్థిక సంఘం సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో 16వ ఆర్థిక సంఘం చైర్మన్ అరవింద్ పనగారియాతో పాటు సభ్యులు పాల్గొన్నారు. రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ పిలుపుమేరకు ఈ సమావేశంలో విశాల పాల్గొని సభ్యులకు పలు సూచనలు చేశారు. స్థానిక సంస్థల బలోపేతానికి ఆర్థిక సంఘం నిధులను అధికంగా ఇవ్వాలని ఆమె కోరారు.

ఉపాధ్యాయ వృత్తి పవిత్రమైనది

తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ పాండు



హెచ్‌ఎం, ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న పాండు, గ్రామస్తులు

షాబాద్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తి ఎంతో పవిత్రమైనదని తాళ్లపల్లి మాజీ ఎంపీటీసీ మద్దూరు పాండు పేర్కొన్నారు. సోమవారం మండల పరిధిలోని వెంకమ్మగూడ ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం సింహాద్రినాయుడు జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్న సందర్భంగా ఆయనను ఘనంగా సన్మానించారు. అదేవిధంగా ఆయనతో పాటు తోటి ఉపాధ్యాయుడు హేమసుందర్‌రావును సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులను ఉత్తమపౌరులుగా తీర్చిదిద్దే బాధ్యత గురువులదేనన్నారు. విద్యార్థుల భవితకు బాటలు వేయడంలో వారి కృషి ఎనలేనిదని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, గ్రామస్తులు ఉన్నారు.

భక్తిశ్రద్ధలతో గణనాథుడికి పూజలు



షాబాద్‌లో వినాయకుడికి పూజలో పాల్గొన్న నాయకులు



మొయినాబాద్‌రూరల్: అజీజ్‌నగర్‌లో గణనాథుడి పూజలో పాల్గొన్న కొత్త మాణిక్‌రెడ్డి



షాబాద్: లడ్డూ దక్కించుకున్న సీఐ కాంతారెడ్డి



కొందుర్గు: కోలాటం వేస్తున్న గ్రామస్తులు

షాబాద్: వినాయక నవరాత్రులలో భాగంగా సోమవారం మండలంలో వాడవాడలా గణనాథులకు ప్రజలు అత్యంత భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. మండల కేంద్రంలో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి, షాబాద్ సీఐ కాంతారెడ్డి, బీజేవైఎం స్వచ్ఛ భారత్ సెల్ కన్వీనర్ రాము వినాయకులకు ప్రత్యేక పూజలు చేసి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. అనంతరం అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు.

మొయినాబాద్‌రూరల్: గ్రామాల్లో వినాయక నిమజ్జనాలను ప్రశాంతంగా జరుపుకోవాలని బీఆర్‌ఎస్ జిల్లా నాయకుడు, మాజీ ఎంపీటీసీ కొత్త మాణిక్‌రెడ్డి అన్నారు. అజీజ్‌నగర్‌లో ఏర్పాటు చేసిన వినాయక పూజల్లో సోమవారం కొత్త మాణిక్‌రెడ్డి పాల్గొని పూజలు నిర్వహించారు.

ఘనంగా వినాయక నిమజ్జనం

షాబాద్: షాబాద్ పోలీస్‌స్టేషన్‌లో వినాయక నిమజ్జన కార్యక్రమం సోమవారం అంగరంగ వైభవంగా జరిగింది. సీఐ కాంతారెడ్డి రూ.15వేల 1 వంద రూపాయలకు లడ్డూను వేలం పాటలో దక్కించుకున్నాడు. జైబోలో గణేశ్ మహారాజ్‌కీ జై అంటూ పాటలు పాడుతూ గణపయ్యకు పూజలు నిర్వహించారు. గ్రామంలోని పురవీధుల గుండా వినాయకుడిని ఊరేగించారు. స్టేషన్ ఆవరణలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నిర్వహించిన శోభాయాత్రలో సంప్రదాయ నృత్యాలు, కోలాటం ఆకట్టుకున్నాయి. వినాయకుడిని షాబాద్ పహిల్వాన్ చెరువులో నిమజ్జనం చేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ నవీన్‌రెడ్డి, సిబ్బంది ఉన్నారు.

ఉత్సాహంగా..

కొందుర్గు: చౌదరిగూడ మండల కేంద్రంలో నాయీ బ్రాహ్మణ సంఘం ఆధ్వర్యంలో ప్రతిష్ఠించిన వినాయకుడిని సోమవారం నిమజ్జనానికి తరలించారు. ఈ సందర్భంగా వినాయకుడి లడ్డూ ప్రసాదాన్ని వేలం వేశారు. అనంతరం కోలాటాలు, భజనలు చేస్తూ స్వామివారిని వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో మహిళల సంప్రదాయ నృత్యాలు ఆకట్టుకున్నాయి. ఆంజనేయులు, యాదయ్య, నారాయణ, రాజు, వెంకటయ్య పాల్గొన్నారు.

కాళోజీ సేవలు మరువలేనివి

షాద్‌నగర్: ప్రజాకవి కాళోజీ నారాయణరావు నిత్య చైతన్య శీలి అని షాద్‌నగర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. ప్రజాకవి కాళోజీ జయంతిని పురస్కరించుకొని సోమవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో తెలంగాణ భాషా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యమానికి ఊపిరిగా జీవించిన కాళోజీ అన్యాయానికి దిశానిర్దేశం చేశారన్నారు. విద్యార్థి దశ నుంచే నాయకత్వ లక్షణాలు పెంపొందించుకొని పోరాటాల్లో పాల్గొన్నారన్నారు. వాడుక భాషలోని మాధుర్యాన్ని చాటి చెప్పి అవినీతిని అక్షరాలతో బద్దలు కొట్టిన మహనీయుడని కొనియాడారు. విద్యార్థులు తెలుగు భాషపై మంచి పట్టు సాధించాలన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు శ్రీనివాసులు, డాక్టర్ పి.సత్యనారాయణ, డాక్టర్ ఎస్.రవిప్రసాద్, బంగ్లావతి, విజయలక్ష్మి, శాంతి, విజయజ్యోతి, దేవయ్య, జయ, నదీరాబేగం, మురారీ, శివశంకర్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

నారాయణరావుకు నివాళి

కొందుర్గు: చౌదరిగూడ మండలంలోని ఇంద్రానగర్ గురుకుల పాఠశాలలో సోమవారం ప్రజా కవి కాళోజీ నారాయణరావు జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి సిబ్బంది పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో నరేశ్, ప్రవీన్, చంద్రయ్య, ఇందిరా, ఉష, అనూష, కవిత పాల్గొన్నారు.



షాద్‌నగర్: మాట్లాడుతున్న వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి



కొందుర్గు: ఇంద్రానగర్ గురుకుల పాఠశాలలో కాళోజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న సిబ్బంది

ఉపాధ్యాయులకు సన్మానం



చేవెళ్ల: ఉపాధ్యాయులతో గ్రామ నాయకులు, విద్యార్థులు

చేవెళ్ల: సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని గుండాల పీఏసీఎస్ చైర్మన్ నక్క బుచ్చిరెడ్డి అన్నారు. మండలంలోని గుండాల జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామ నాయకులు గణేశ్, బాల్‌రాజ్, యాదగిరి సోమవారం పాఠశాల నుంచి ఇటీవల బదిలీ అయిన ఉపాధ్యాయులకు వీడ్కోలు, కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగత, సన్మాన కార్యక్రమాలు నిర్వహించారు. కొత్తగా వచ్చిన ఉపాధ్యాయులు విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించాలని ఈ సందర్భంగా వారు కోరారు. అనంతరం ఉపాధ్యాయులను సన్మానించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు ఉన్నారు.

కొత్తూరు: బదిలీపై ఇతర పాఠశాలలకు వెళ్తున్న ఉపాధ్యాయులను మండల పరిధిలోని కొడిచర్లతండా వాసులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా మాజీ ఎంపీటీసీ రవీందర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఖాజీగూడ, కొడిచర్లతండాలో ఉన్న ప్రాథమిక పాఠశాలల్లో గత 13 ఏళ్లుగా హెచ్‌ఎంలుగా విధులు నిర్వహించిన శ్రీనివాస్‌రెడ్డి, శ్రీధర్‌రెడ్డి ఎందరో విద్యార్థులను ఉన్నతంగా తీర్చిదిద్దినట్లు వివరించారు. అంకితభావంతో సమయపాలన పాటిస్తూ విద్యార్థులను చదువుల్లో వారు ప్రోత్సహించిన తీరును ప్రశంసించారు. అనంతరం వారితో పాటు పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయులను రవీందర్‌రెడ్డి, పలువురు నాయకులు శాలువాలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు విష్ణు నాయక్, కుమార్‌నాయక్, మోహన్, భాస్కర్, శ్రీనివాస్, రవి, శంకర్‌నాయక్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

గండిపేట చెరువులో 12 కిలోల చేప



12 కిలోల చేప పట్టుకున్న యువకులు

మొయినాబాద్‌రూరల్: కురుస్తున్న వర్షాలతో జంట జలాశయమైన గండిపేట చెరువు నిండుకుండలా మారింది. దీంతో చెరువులో ఉన్న చేపలు ఒడ్డున చేరుతున్నాయి. సోమవారం హిమాయత్‌నగర్ నగరానికి చెందిన కొంతమంది యువకులు చేపల వేటలో పడ్డారు. దీంతో హిమాయత్‌నగర్ యువకులకు దాదాపు 12కిలోలపైగానే చేప దొరకడంతో వారి ఆనందాలు అవధులు దాటాయి. నెలరోజుల నుంచి నిత్యం కొనసాగుతోంది. యువకులు ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు చెరువు వద్దే ఉంటూ గాళాలు వేసి చేపలు పడుతున్నారు.